క్లుప్తంగా

వెండి కవచం బహూకరణ



నల్లగంగమ్మ ఆలయ చైర్మన్‌కు కవచం అందిస్తున్న దాత

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వరాల దేవతగా నీరాజలందుకుంటున్న ప్రసిద్ధ శ్రీనల్లగంగమ్మ ఆలయానికి అదే ప్రాంతానికి చెందిన సామాను చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం రూ.25,116 విలువ చేసే వెండి కవచాన్ని కానుకగా అందజేశారు. ఆలయానికి విచ్చేసి దేవస్థానం చైర్మన్ కంఠా రమేష్‌కు కానుకను అందజేశారు. దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపి, అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

ఏర్పేడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బండారుపల్లె ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడలో భాగంగా విద్యార్థులకు క్రీడలు, పెయింటింగ్, ఛాయా చిత్రాలు పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ద్వారకానాథ్‌రెడ్డి, ఉమామహేశ్వర్, వెంకటేష్ పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



మాట్లాడుతున్న ఏఈ భానుప్రకాష్

సత్యవేడు: మండలంలో నాడు-నేడు ఫేజ్-2 కింద మంజూరైన పాఠశాలల్లో పది రకాల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు నాడు-నేడు పనులపై సమావేశం జరిగింది. మండల పరిధిలో తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలు, కొత్త అంగన్‌వాడీ భవనాలు 3, అడిషినల్ క్లాస్ రూమ్‌ల నిర్మాణాలు తొమ్మిందిటినీ త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఎంఈఓలు కె. రవి, ఉషా, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, త్యాగరాజులు, కోటీశ్వరం, వి.వాణి, డీవీ రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్లు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్లు ఉంటాయని డీపీటీఓ చెంగల్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేట డిపో పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి మంగళవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ రెండు డిపోల పరిధిలోని స్థలాలను లీజు తీసుకునేందుకు ఆసక్తి ఉన్న పలువురు వ్యాపారులు విచ్చేశారు. వారికి డీపీటీఓ ఆర్టీసీ నిబంధనలను వివరించారు. టెండర్ల తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, డిప్యూటీ ఈఈ చెన్నకేశవరావు, వెంకటగిరి, సూళ్లూరుపేట డిపో మేనేజర్లు రాజవర్ధన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూజీ కోర్సులకు వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: స్విమ్స్ యూనివర్సిటీలో పలు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సిమ్స్ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో 2023-24వ విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు బీఎస్సీ (నర్సింగ్), బ్యాచలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బీఎస్సీ (పారామెడికల్) కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వెబ్ ఆప్షన్ ద్వారా పైన తెలిపిన కోర్సులకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. సీట్ల సంఖ్య, ఫీజు వివరాలు, ఎంపిక విధానం తదితర వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్ https://svimstpt. ap. nic. in ను సందర్శించాలని ఆ ప్రకటనలో కోరారు.

20న సీపీఎం మహాసభలు

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో ఈనెల 20వ తేదీ నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్, తులసీరాజన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా వరదరాజస్వామి
ఆలయ పునర్నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు, స్థపతి పరమేశ్వరప్ప

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ పురాతన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప తెలిపారు. మంగళవారం దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుతో కలిసి ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేలా అన్ని అనుమతులు సత్వరమే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు బేస్ లెవెల్ వరకు వచ్చాయని, 15 లేయర్లుగా రాతి కట్టడం నిర్మాణ పనులు జరగాల్సి ఉందని. 4 లేయర్లకే అనుమతి ఉందని దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు ఆయనకు వివరించారు. మిగిలిన 11 లేయర్లకు అవసరమైన అనుమతిని త్వరితగతిన ఇవ్వాలని కోరారు. పునర్నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే మంజూరు చేస్తామని పరమేశ్వరప్ప స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం, డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ కిషోర్ కుమార్, అసిస్టెంట్ స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



విద్యార్థినులతో పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ఎస్సీ బాలికల హాస్టల్‌లో తాగునీటి సమస్యను మంగళవారం వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పరిష్కరించారు. హాస్టల్‌లో తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు గురైంది. విద్యార్థినులు సమస్యను పవిత్రారెడ్డికి విన్నవించారు. వెంటనే స్పందించిన ఆమె మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్బయ్య, వేణు, రాజ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

పెళ్లిరోజు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న నాయకులు

నాగలాపురం: సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలంకు మంగళవారం వైఎస్సార్ సీపీ నాగలాపురం నాయకులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణవనంలోని నివాసంలో ఆయనను కలిశారు. ఎమ్మెల్యే దంపతులకు గజమాల వేసి, శాలువతో సత్కరించారు. మండల కన్వీనర్ అపరంజిరాజు, సర్పంచ్‌లు సుధా చిన్న దొరై, మహేంద్ర, ఏలుమలై ఎంపీపీ సింధూశ్యామ్, ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎస్ఎం సురేష్, వైస్ ఎంపీపీ జాయస్ దానవేల్, మార్కెట్ కమిటీ సభ్యుడు అలగేషన్, నాయకులు దేశన్, ధనరాజ్, గిరి, కుప్పయ్య, ఎంపీటీసీ సభ్యుడు రాజు, సోషల్ మీడియా ప్రతినిధి ఈశ్వర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని కొత్తకండ్రిగ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి పదార్థాల రుచి చూశారు. అనంతరం మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి విశేష హారతి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ప్రసిద్ధ శ్రీసర్వమంగళా సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం త్రయోదశి సందర్భంగా శ్రీనందీశ్వరస్వామి వారికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏక కాలంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు విశేష పూజలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామికి ఏక కాలంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప దీపనైవేద్యాలు సమర్పించారు. ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం.బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ శ్రీహరి కథనం వివరాలు.. శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం(30), మునీంద్ర(19) ద్విచక్ర వాహనంపై మంగళవారం తిరుపతికి వెళ్లి రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మేర్లపాక వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి



సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామిని సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: విద్యార్థులు నవ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ఎస్వీయూ వీసీ కే రాజారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో సీఐడీ పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కులాల సాధికారిత, చట్టాలపై విద్యార్థులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకుని, సమాజాన్ని చైతన్య పరచాలని సూచించారు. బలహీన వర్గాలపై జరిగే అఘాయిత్యాలు, అరాచకాలను రూపుమాపడంలో విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. అనంతరం సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో సమానత్వం, కుల వివక్ష నిర్మూలించడానికి ప్రివెన్షన్ ఆఫ్ సివిల్ రైట్ యాక్ట్ ఉన్నప్పటికీ అక్కడక్కడా ఎస్సీ, ఎస్టీలపై వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. దీంతో 1989లో ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ తీసుకొచ్చి కఠిన శిక్షలను అమలు చేస్తున్నామన్నారు. ఈ సెక్షన్ క్రింద బాధితులకు ప్రత్యేకమైన హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులను సీఐడీ శాఖ అధికారులు జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏఎస్పీ జే వెంకటరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, సీఐడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీలక్ష్మి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, రామచంద్రాపురం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నిఘా పర్యవేక్షణ కమిటీ తరపున టీ జయపాల్ పాల్గొన్నారు.

చవితికి నవసంధి ఆలయాల ముస్తాబు



ముత్యాలమ్మ గుడివీధి ఆలయానికి రంగులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో వెలసి ఉన్న నవసంధి వినాయక ఆలయాలు వినాయ క చవితికి ముస్తాబవుతున్నాయి. ఈనెల 18న వినాయక చవి తి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థా నం తరపున పట్టణంలోని నవ సంధి వినాయక ఆలయాలకు సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆలయాలను సప్త వర్ణాలతో అలంకరిస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని సాధించడానికి తిరుపతి నగరంలోని అలిపిరి రోడ్డు మెడికల్ కళాశాల సమీపంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ) అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయప్రతాప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న వారు, 8వ తరగతి/ఫిట్టర్, ప్లంబర్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో 80 శాతం ప్రాక్టికల్, 20 శాతం థియరీ ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 9700413939, 9866241270, 9000894035, 7981155147 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తెలుగు సాహిత్యం విశిష్టమైంది

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. తెలుగు సాహిత్యం విశిష్టమైందని తెలిపారు. కార్యక్రమానికి తెలుగుశాఖ అధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. 1994 నుంచి సాహితీ కార్యక్రమాలు జరుగుతున్నాయని, పలురంగాల ప్రముఖులను ఆహ్వానించి విద్యార్థులకు ఉపన్యాసాలను ఇప్పించామని తెలిపారు. సాహిత్యం అనేది విశాలం, విస్తృతమైందన్నారు. పూరి వీరేశలింగం రచించిన స్త్రీ విద్య, గరిమెళ్ల సత్యనారాయణ దేశభక్తిపై రచించిన మాకొద్దీ తెల్లదొరతనం వంటి గీతాలను ప్రస్తావిస్తూ విద్యార్థులకు వివరించారు. జాషువా పోరాట పటిమ, కొలకలూరి ఇనాక్ సాహిత్య స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు తేజావాణి, సుభాషిని, లక్ష్మీ ప్రియ, యువశ్రీ పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ కె.మధుసూదన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీపద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చనిపోవడం ద్వారా ఏమీ సాధించలేమని జీవించి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు ఆత్మహత్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహదేవమ్మ, కుశాల్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అంకయ్య, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

కట్ట పుట్టాలమ్మా..శరణు..శరణు



శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, అంజూరు శ్రీనివాసులు



విశేషాలంకరణలో కట్టపుట్టాలమ్మ తల్లి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి శ్రీకట్టపుట్టాలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు సులభంగా అమ్మవారిని దర్శించుకునేలా క్యూలు ఏర్పాట్లు చేశారు. ఆలయ ధర్మకర్తలు కుర్రకాల్వ రామచంద్రయ్య, కుర్రకాల్వ వాసు ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా చేశారు.

శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

అమ్మవారికి శ్రీకాళహస్తి దేవస్థానం తరపున వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టువస్త్రాలను సమర్పించారు. వారు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ పెద్దలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు. రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, నాయకులు మురగయ్య, సుబ్బారెడ్డి, శివ, పీడీ బాబుయాదవ్, సుబ్రమణ్యం, చిన్ని, బాబురావు, రాజ, సతీష్, పార్థసారథి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులు తక్షణం పరిష్కరించాలి



పల్లమాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఆయన మంగళవారం పల్లమాల. కాటూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్పందనలో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలను తక్షణం పరిష్కరించి, ఇబ్బందులు ఏమైనా ఉంటే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని, సర్వేను పక్కా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీలార్ చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో మంగళవారం భూముల రీ సర్వేను డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రైతులకు ఓ వరమని, రైతులందరూ భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. వంద సంవత్సరాల తర్వాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతోందని తెలిపారు. రీ సర్వేలో అన్ రిజిష్టర్, వంశపారంపర్య భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరం అవుతాయని పేర్కొన్నారు. సాగులో ఉన్నవారి పేరుపై భూమికి పాసు పుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో 2,200 ఎకరాల భూములను సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ గురవయ్య, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, శ్రావణ్ కుమార్, సర్వేయర్లు పాల్గొన్నారు.

డీసీసీబీ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ తేజస్వి

సత్యవేడు: డిపాజిట్లపై డీసీసీ బ్యాంకులో అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ తేజస్వి తెలిపారు. మంగళవారం మదనంబేడు రైతు భరోసా కేంద్రంలో డీసీసీ బ్యాంకు అధికారులు క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసం దర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో రుణం పొందిన ప్రతి రైతుకు కూపే కేసీసీ కార్డును అందజేస్తామని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన వారికి సంవత్సరం నుంచి రెండేళ్లలోపు 7.50, రెండు నుంచి ఐదు సంవత్సరాల లోపు 6.50 శాతం వడ్డీ చెల్లిస్తారని పేర్కొన్నారు. ప్రతి డిపాజిట్‌పై ఇన్సూరెన్సు గ్యారెంటీ ఉంటుందన్నారు. చిరువ్యాపారులు బ్యాంకులో రోజు రూ. 50 నుంచి 150 వంతున 120 రోజులు చెల్లిస్తే రెట్టింపు రుణం అందిస్తామని పేర్కొన్నారు. స్వల్ప అద్దెతో సేఫ్ లాకర్ సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నామన్నారు.బ్యాంకు సూపర్‌వైజర్ శరత్ కుమార్, హార్టీకల్చర్ అధికారిణి రాధారాణి, రుద్రయ్య, వీహెచ్ఏ మురళి తదితరులు పాల్గొన్నారు.

రంజిపజేసిన నృత్య ప్రదర్శనలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సాంస్కృతిక కళావేదిక వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహూతులను రంజింప జేసింది. భక్తి గీతాలకు అనుగుణంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. చిన్నారులకు ఆలయం తరపున మెమొంటోలు ప్రదానం చేశారు.
- శ్రీకాళహస్తి